సంపుటి :02 సంచిక :271 పేజీలు :05
వెల ₹5
# అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people
సోమవారం 05, జనవరి 2026

## త్వరితగతిన పరిష్కరించాలి

5

ప్రజావాణి అర్జీలు పెండింగ్ లో ఉండొద్దు
హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్





## మహా జాతరలో పాల్గొనండి

- సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ విష్ణుదేవ్ వర్మకు మంత్రుల ఆహ్వానం
- 19న సమ్మక్క సారలమ్మ గద్దెల పునః ప్రారంభం
- ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి

4



## రేపు జనగామకు కేటీఆర్

5

ఏర్పాట్లను పరిశీలించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి



# పట్టణ బరి.. గెలుపే గురి

### ఉమ్మడి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల కోలాహలం

- ఫిబ్రవరిలో నిర్వహించేందుకు ఈసీ ఏర్పాట్లు
- ఈనెల 11 లేదా సంక్రాంతి తర్వాత నోటిఫికేషన్
- ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావహుల ఉత్సాహం
- ఎమ్మెల్యేలు, పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు షురూ
- ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని వ్యూహ ప్రతివ్యూహాలు

2

ఉమ్మడి జిల్లాలోని 12 మున్సిపాలిటీల్లో ఎన్నికల వేడి మొదలైంది. పరకాల, నర్సంపేట, వర్ధన్నపేట, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, భూపాలపల్లి, మహబూబాబాద్, డోర్నకల్, కేసముద్రం, మరిపెడ, తొర్రూరు, ములుగు మున్సిపాలిటీల్లో పోటీ చేసేందుకు ఆశావహులు ఇప్పటికే క్యూకట్టారు. ఎమ్మెల్యేలు, ఆయా పార్టీల జిల్లా ఇన్‌చార్జులు, నియోజకవర్గ ఇన్‌చార్జుల చుట్టూ ప్రదక్షిణలు ప్రారంభించారు. వారిని ఎలాగైన ప్రసన్నం చేసుకున్న వార్డు సభ్యులుగా పోటీచేయాలని ఉవ్విళ్లూరుతున్నారు. కొందరైతే ఇప్పటికే తమ అనుచరులు, అనుయాయులను, కార్యకర్తలను పోగు చేసి ప్రచారం కూడా ప్రారంభించారు. అనేక చోట్ల సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. ఎమ్మెల్యేలు సైతం పట్టణాల్లో పట్టు సాధించేందుకు, క్యాడర్ బలోపేతం చేసేందుకు ఎన్నికల్లోకి సై..అంటే సై అంటూ ముందుకు దూకుతున్నారు.

- అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి




## హరీశ్‌రావుకు భారీ ఊరట

- ఫోన్ ట్యాపింగ్ కేసులో రాష్ట్రప్రభుత్వానికి చుక్కెదురు
- సర్కార్ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

2



## రాజకీయ పార్టీగా జాగృతి

- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే ధ్యేయం
- వెనుకబడిన వర్గాల పక్షాన మా పార్టీ పనిచేస్తుంది
- బీఆర్ ఎస్ నన్ను ఎంతో బాధపెట్టింది
- శాసనమండలిలో ఎమ్మెల్సీ కవిత ప్రసంగం

2





## ఆ.. 17 మంది లొంగిపోతే

- మావోయిస్టు రహిత రాష్ట్రంగా తెలంగాణ
- డీజీపీ శివధర్ రెడ్డి

5



- ఉమ్మడి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల కోలాహలం
- ఫిబ్రవరిలో నిర్వహించేందుకు ఈసీ ఏర్పాట్లు
- ఈనెల 11 లేదా సంక్రాంతి తర్వాత నోటిఫికేషన్
- ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావహుల ఉత్సాహం
- ఎమ్మెల్యేలు, పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు షురూ
- ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని వ్యూహ ప్రతివ్యూహాలు

# పట్టణ బరి.. గెలుపే గురి

**ఉమ్మడి జిల్లాలోని 12 మున్సిపాలిటీల్లో ఎన్నికల వేడి మొదలైంది. పరకాల, నర్సంపేట, వర్ధన్నపేట, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, భూపాలపల్లి, మహబూబాబాద్, డోర్నకల్, కేసముద్రం, మరిపెడ, తొర్రూరు, ములుగు మున్సిపాలిటీల్లో పోటీ చేసేందుకు ఆశావహులు ఇప్పటికే క్యూకట్టారు. ఎమ్మెల్యేలు, ఆయా పార్టీల జిల్లా ఇన్ చార్జులు, నియోజకవర్గ ఇన్ చార్జుల చుట్టూ ప్రదక్షిణలు ప్రారంభించారు. వారిని ఎలాగైన ప్రసన్నం చేసుకున్న వార్డు సభ్యులుగా పోటీచేయాలని ఉవ్విళ్లూరుతున్నారు. కొందరైతే ఇప్పటికే తమ అనుచరులు, అనుయాయులను, కార్యకర్తలను పోగు చేసి ప్రచారం కూడా ప్రారంభించారు. అనేక చోట్ల సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. ఎమ్మెల్యేలు సైతం పట్టణాల్లో పట్టు సాధించేందుకు, క్యాడర్ బలోపేతం చేసేందుకు ఎన్నికల్లోకి సై..అంటే సై అంటూ ముందుకు దూకుతున్నారు.**

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :** తెలంగాణ మరో ఎన్నికల సంగ్రామానికి రంగం సిద్ధమైంది. కొంతకాలం నుంచి వాయిదా పడుతూ వస్తున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్రప్రభుత్వం పచ్చజెండా ఊపింది. 16వ ఆర్థిక సంఘం నిధుల విడుదల కావాలంటే మార్చిలోపు ఎన్నికలు పూర్తి కావాల్సి ఉండటంతో రాష్ట్రప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని కంకణం కట్టుకున్నది. సర్కార్ ఆదేశాల మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా కసరత్తును వేగవంతం చేసింది. జనవరి 1వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసిన అధికారులు ఇప్పటికే అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ సైతం పూర్తి చేశారు. ఈ నెల 10న తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు. ఈనెల 11 లేదా సంక్రాంతి సెలవుల అనంతరం మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 మున్సిపాలిటీల్లో ఎన్నికల సందడి మొదలైంది. ఆశావహులు ఎన్నికల్లో పోటీచేసేందుకు ఉత్సాహంగా ఉన్నారు.

### - మున్సిపాలిటీల వారీగా వార్డులు

పరకాల మున్సిపాలిటీలో 22 వార్డులు, నర్సంపేటలో 30, వర్ధన్నపేట 12, జనగామ 30, స్టేషన్ ఘన్‌పూర్ 18, భూపాలపల్లి 30, మహబూబాబాద్ 36, డోర్నకల్ 15, కేసముద్రం 16, మరిపెడ 15, తొర్రూరు 16, ములుగు మున్సిపాలిటీలో 20 వార్డులు ఉన్నాయి. ఓటర్ల జాబితా, వార్డుల వారీగా గణాంకాలు సిద్ధంగా ఉండటంతో ఎన్నికల నిర్వహణకు సాంకేతిక ఇబ్బందులు ఏమీ ఉండవని అధికారులు భావిస్తున్నారు.

### - 2011 జనాభా లెక్కల ప్రకారం

**2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలోని 12 మున్సిపాలిటీల పరిధిలోని 260 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో సుమారు 3.87 లక్షల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల జనాభా ఎక్కువగా ఉంది, ఎస్సీల జనాభా 69,316, ఎస్టీల జనాభా 49,051 ఉంది. ఫిబ్రవరి రెండు లేదా మూడో వారంలో పోలింగ్ నిర్వహించేలా ప్రభుత్వం ఇప్పటికే రోడ్ మ్యాప్ సిద్ధం చేయడంతో, ఆయా పట్టణాల్లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఎన్నికల నగారా మోగకముందే ప్రధాన పార్టీలు క్షేత్రస్థాయిలో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ శ్రేణులను ఉత్తేజపరుస్తున్నాయి.**

### - కార్యకర్తల సమావేశాలు

భూపాలపల్లి పట్టణంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో ఇప్పటికే ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, క్రమశిక్షణతో పని చేసే కార్యకర్తలకు ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే ప్రకటించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఎన్నికల్లో గెలవాలని, భూపాలపల్లి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని దిశానిర్దేశం చేశారు. డీసీసీ అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, పార్టీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఇస్లావత్ దేవన్ రంగంలోకి దిగి కార్యకర్తలకు ఓటర్ల జాబితా, ఓటింగ్ సరళిపై అవగాహన కల్పిస్తున్నారు. మొత్తం 30 వార్డుల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవాలని దిశానిర్దేశం చేస్తున్నారు.




## రాజకీయ పార్టీగా 'జాగృతి'

- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే ధ్యేయం
- వెనుకబడిన పక్షాన మా పార్టీ పనిచేస్తుంది
- బీఆర్ఎస్ నన్ను ఎంతో బాధ పెట్టింది
- శాసన మండలిలో ఎమ్మెల్సీ కవిత ప్రసంగం

అక్షరదర్బార్, హైదరాబాద్: ప్రస్తుతం సామాజిక సాంస్కృతిక సంస్థగా ఉన్న 'జాగృతి'ని రానున్న అసెంబ్లీ ఎన్నికల నాటికి పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మారుస్తున్నట్లు సంస్థ అధినేత్రి, ఎమ్మెల్సీ కవిత సంచలన ప్రకటన చేశారు. శాసనమండలిలో సోమవారం ఆమె ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ అస్తిత్వం కోసం, ప్రజల హక్కుల కోసం పోరాడే ఒక శక్తిగా ఈ పార్టీ ఎదుగుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. గత పన్నెండేళ్లుగా ప్రధాన పార్టీలు ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తున్నాయని విమర్శించిన ఆమె, రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ప్రత్యామ్నాయ వేదిక అవసరమని పేర్కొన్నారు. లెఫ్ట్ పార్టీల సోదరులు, మావోయిస్టు సానుభూతిపరులు మరియు ప్రజాస్వామ్య పద్ధతిలో మార్పు కోరుకునే వారందరూ తనకు మద్దతు ఇవ్వాలని ఆమె పిలుపునిచ్చారు. మాజీ ఇంటి పార్టీ అయిన టీఆర్ఎస్ (బీఆర్ఎస్)పై ఆమె తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన లక్షలాది మంది ఉద్యమకారులకు ఆ పార్టీలో ఇసుమంత కూడా గౌరవం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది పదవులు ఉన్నా ఉద్యమకారులను గుర్తించకపోవడం విచారకరమని, ముఖ్యంగా ఉద్యమంలో పాల్గొన్న ఆడబిడ్డలకు అవకాశాలు కల్పించలేదని దుయ్యబట్టారు. తనలాంటి ఒకరిద్దరికి అవకాశం వచ్చినా, రాజకీయంగా ఎదగకుండా చిత్రహింసలకు, అవమానాలకు గురిచేశారని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. తొమ్మిదిన్నరేళ్ల కాలంలో లక్షల కోట్ల బడ్జెట్ ఖర్చు చేసినా, పేదలకు ఇళ్లు ఎందుకు ఇవ్వలేకపోయారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ వస్తే అద్భుతాలు జరుగుతాయని ఆశించిన ప్రజల కలలను అడియాశలు చేశారని ఆమె విమర్శించారు. కాంగ్రెస్ తీరుపై కూడా ఆమె మండిపడ్డారు. గత రెండేళ్లుగా కాంగ్రెస్ పార్టీ మహిళలను, నిరుద్యోగులను, ఉద్యమకారులను వంచిస్తోందని ఆరోపించారు. నిరుద్యోగులు, దళితులు, గిరిజనులు, మైనార్టీ బిడ్డల కోసం పోరాడే వేదికగా జాగృతి నిలుస్తుందని స్పష్టం చేశారు. రాజకీయ నేపథ్యం లేని యువత, మహిళలకు తాను ఒక రాజకీయ వేదికను కల్పిస్తానని హామీ ఇచ్చారు. అన్ని బంధాలను తెంచుకుని, అవమాన భారంతోనే ఇంటి పార్టీ నుంచి బయటకు వచ్చానని ఆమె ఈ సందర్భంగా వెల్లడించారు.

# హరీశ్ రావుకు భారీ ఊరట

- ఫోన్ ట్యాపింగ్ కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురు
- సర్కార్ పిటిషన్ ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

అక్షరదర్బార్, న్యూఢిల్లీ : తెలంగాణలో గత కొంతకాలంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావుకు అత్యున్నత న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది. ఈ వ్యవహారంలో ఆయనపై ఉన్న అభియోగాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ ఎల్‌పీ)ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసులో హరీష్ రావుకు వ్యతిరేకంగా సరైన ఆధారాలు లేవంటూ గతంలోనే హైకోర్టు సానుకూల తీర్పునిచ్చింది. అయితే, హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టులో జరిగిన విచారణలో ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా వాదనలు వినిపించారు. ఫోన్ ట్యాపింగ్ విచారణ ఇంకా కొనసాగుతోందని, దీనికి సంబంధించి కీలక ఆధారాలు ఉన్నందున హరీష్ రావును విచారించేందుకు అనుమతి ఇవ్వాలని ఆయన కోర్టును కోరారు. అయితే, ప్రభుత్వం సమర్పించిన వాదనలతో అత్యున్నత న్యాయస్థానం ఏకీభవించలేదు. ఈ కేసులో హరీష్ రావుకు ఎలాంటి సంబంధం లేదని హైకోర్టు ఇదివరకే స్పష్టం చేసిన విషయాన్ని ధర్మాసనం ఈ సందర్భంగా గుర్తు చేసింది. ప్రభుత్వం దగ్గర బలమైన ఆధారాలు లేవని అభిప్రాయపడుతూ, ఇకపై ఈ కేసులో ఆయనను విచారించేందుకు వీల్లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఈ తీర్పుతో ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావుపై ఉన్న ఆరోపణలన్నీ దాదాపుగా ముగిసినట్లేనని న్యాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.



## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో అలుపెరగని పీఆర్టీయూ

అక్షర దర్బార్, మరిపెడ : మరిపెడ మండల విద్యాశాఖ కార్యాలయంలో, పిఆర్టీయూ (PRTU) 2026 క్యాలెండర్‌ను మండల విద్యాశాఖ అధికారిణి గాదె అనితా దేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పిఆర్టీయూ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పిఆర్టీయు మండల ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్ గౌడ్, గౌరవ అధ్యక్షులు గుగలోత్ అర్జున్, సంఘ బాధ్యులు దోమల లింగన్న, రాంమోహన్, దత్తప్రసాద్, యాకయ్య, కరుణాకర్, సరోజ్, వెంకన్న, నర్సిరెడ్డి, లెనిన్, వెంకన్న, విజయ్ కుమార్, వెంకటయ్య, రవి, నామ, శ్రీను, భీమా, నివేదిత, రాజకుమారి, మురళి, విశ్వనాథం, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలి

**–కాటారం డీఎస్పీ సూర్యనారాయణ**



అక్షర దర్బార్, మల్హర్ : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలని కాటారం డీఎస్పీ సూర్యనారాయణ సూచించారు. తాడిచెర్ల గ్రామ సర్పంచ్ బండి స్వామి సమక్షంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన "Fraud ka Full Stop" అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, సోషల్ మీడియా వినియోగం, బ్యాంకింగ్ లావాదేవీల్లో జాగ్రత్తలు పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ OTPలను ఇతరులతో పంచుకోకూడదన్నారు. లోన్ ఫ్రాడ్స్, డిజిటల్ అరెస్ట్ పేరుతో వచ్చే మోసపూరిత కాల్స్‌కు మోసపోవద్దని హెచ్చరించారు. సర్పంచ్ బండి స్వామి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొంటూ పోలీస్ శాఖను అభినందించారు.



## పెన్షనర్ల అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం

**–టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. విష్ణువర్ధన్ రెడ్డి**

అక్షరదర్బార్, మరిపెడ : మరిపెడ మండల విద్యా వనరుల కేంద్రంలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ నూతన క్యాలెండర్‌ను ఎంఈవో జి. అనితా దేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీపిటిఎఫ్ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పెన్షనర్ల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఎంఈవో అనితా దేవి టీపిటిఎఫ్ ఉపాధ్యాయుల పక్షపాతి సంఘమని ప్రశంసించారు. కార్యక్రమంలో మరిపెడ మండల టి పి టి ఎఫ్ అధ్యక్షులు నల్లా పవన్ కుమార్, ప్రధాన కార్యదర్శి హఫీజర్, ఉపాధ్యక్షురాలు జి. మంజూ భార్గవి, మాచర్ల రవి, హేమ్లా నాయక్, మహేందర్, ఇందిరా దేవి ,ఆదిలక్ష్మి పాల్గొన్నారు.



## 'ఉపాధి' పనులను సద్వినియోగం చేసుకోవాలి

**–సర్పంచ్ కూరతోట స్వప్న సురేష్**

అక్షరదర్బార్, దుగ్గొండి : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అందుతున్న పనులను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గుడి మహేశ్వరం గ్రామ సర్పంచ్ కూరతోట స్వప్న సురేష్ కోరారు. సోమవారం గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులను ప్రారంభించిన ఆమె, గ్రామస్తుల అవసరాల మేరకు పనులను పారదర్శకంగా చేపడతామని, అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్ గౌడ్,గౌరవ అధ్యక్షులు గుగలోత్ అర్జున్, సంఘ బాధ్యులు దోమల లింగన్న, రాంమోహన్, దత్త ప్రసాద్, యాకయ్య, కరుణాకర్, సరోజ, వెంకన్న, నర్సిరెడ్డి, లెనిన్, వెంకన్న, విజయ్ కుమార్, వెంకటయ్య, రవి, నామ, శ్రీను, భీమా, నర్సిరెడ్డి, నివేదిత, రాజకుమారి, మురళి, విశ్వనాథం, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## వెనిజులాపై అమెరికా దాడులను ఆపాలి

**–సీపీఐ(ఎంఎల్) జయశంకర్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్**



అక్షర దర్బార్, చిట్యాల : వెనిజులా దేశంపై అమెరికా సాగిస్తున్న సైనిక దాడులు, బెదిరింపులు తక్షణమే నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) జయశంకర్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం చిట్యాల మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు ఎన్నుకున్న అధ్యక్షుడు నికోలాస్ మదురోను అరెస్టు చేయాలన్న అమెరికా ప్రకటనలు సామ్రాజ్యవాద దురహంకారానికి నిదర్శనమని తీవ్రంగా ఖండించారు. వెనిజులా ప్రజలు తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకునే హక్కును కాలరాస్తూ అమెరికా ప్రజాస్వామ్యాన్ని సైనిక బలంతో తొక్కేస్తోందని, ఇది అంతర్జాతీయ చట్టాలకు, ఐక్యరాజ్యసమితి నియమాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు, ప్రజాస్వామ్య శక్తులు అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఏకమవ్వాల్సిన అవసరం ఉందని, ప్రపంచ శాంతి కోసం విద్యార్థులు, యువత, ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ



అక్షర దర్బార్, చిట్యాల : రోడ్డు భద్రతపై అవగాహన లోపం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నివారణ కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నాయని వెహికల్ ఇన్స్పెక్టర్ సంధాని మహమ్మద్ తెలిపారు. సోమవారం చిట్యాల మండల కేంద్రంలో స్థానిక పోలీసులు, ఆర్టీవో అధికారులు విద్యార్థులు, యువతతో కలిసి రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించి అనంతరం సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం, అధిక వేగం, హెల్మెట్, సీటుబెల్ట్ ధరించకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. వాహనాలను ఎడమ వైపునే నడపాలని, ఐఎస్ఐ మార్కు ఉన్న హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. అలాగే ప్రమాద బాధితులను మొదటి గంటలోపు ఆసుపత్రికి చేర్చిన వారికి రూ.25 వేల నగదు బహుమతి అందించే 'రహవీర్' పథకం అమల్లో ఉందని తెలిపారు.

## సర్పంచులు సేవాభావంతో పని చేయాలి

అక్షరదర్బార్, మడికొండ : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన వాల్మీకి సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు ప్రజలకు సేవాభావంతో పనిచేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా వాల్మీకి సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు భోగి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం కాజీపేట మండలం మడికొండలో "విక్టరీస్ ఫెలిసిటేషన్" కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, స్థానిక సంస్థల్లో సర్పంచ్ పదవి కీలకమని, రానున్న రోజుల్లో ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. ప్రజల ఆశలకు అనుగుణంగా పని చేసి, గ్రామాభివృద్ధికి కృషి చేయాలని, సమస్యల పరిష్కారంలో నియోజకవర్గాల ఎమ్మెల్యేల సహకారం తప్పనిసరి అని సూచించారు. వాల్మీకి కులస్తుల ఐక్యతను భవిష్యత్తులో మెరుగుపరచాలని, గ్రామ స్థాయిలో రాజకీయ ఈక్వేషన్స్‌ను ధైర్యంతో ఎదుర్కోవాలని కూడా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాల్మీకి ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జూనియర్ కళాశాలకు సొంత భవనం నిర్మించాలి

అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని కోరుతూ ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కళాశాల భవనం శిథిలావస్థలో ఉండటంతో విద్యార్థులకు ప్రమాదం ఉందని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా అధ్యక్షుడు జన్నా రమేష్, కార్యదర్శి చుక్క ప్రశాంత్ తెలిపారు. కళాశాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, డిగ్రీ కళాశాలలో మహిళలకు ప్రత్యేక హాస్టల్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**–జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



అక్షర దర్బార్, భూపాలపల్లి : ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. సోమవారం ఐడీఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 47 దరఖాస్తులు స్వీకరించి, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం శాఖల వారిగా 350 ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటినీ వచ్చే వారంలోపే పరిష్కరించాలని స్పష్టం చేశారు. కొన్ని శాఖల్లో పెండింగ్ అధికంగా ఉందని, దరఖాస్తుల పరిష్కారంలో పర్యవేక్షణ లోపిస్తున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి ప్రజావాణికి వస్తున్నారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా అధికారులు బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## జర్నలిస్ట్ ప్రొటెక్షన్ ఫోర్స్ రాష్ట్ర సారథిగా పర్కాల సమ్మయ్య గౌడ్

అక్షర దర్బార్, భూపాలపల్లి : అఖిల భారతీయ జర్నలిస్ట్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏబీజేపీఎఫ్) తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా సీనియర్ పాత్రికేయులు పర్కాల సమ్మయ్య గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని ఉప్పల్ విద్యానికేతన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జర్నలిస్టుల విస్తృత స్థాయి సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి విచ్చేసిన పత్రికా సంపాదకులు, సీనియర్ జర్నలిస్టులు ఈ సమావేశంలో పాల్గొని సమ్మయ్య గౌడ్ అభ్యర్థిత్వానికి పూర్తి మద్దతు ప్రకటించారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన రక్షణ కోసం ఆయన నిరంతరం కృషి చేస్తారనే నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించినట్లు ప్రతినిధులు తెలిపారు.



## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

అక్షర దర్బార్, చెన్నారావుపేట : లింగాపురం గ్రామానికి చెందిన పల్లాటి సబిత విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో పెద్ద దిక్కును కోల్పోయిన చిన్నారులు దేవిక, సహస్ర కుటుంబానికి ఆదరణగా గ్రామ కాంగ్రెస్ నాయకులు, 3వ వార్డు వాసులు, గ్రామస్తులు, దాతలు, దయార్ద్ర హృదయులు కలిసి ఆర్థిక సహాయం అందించారు. సోమవారం ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా సేకరించిన రూ.2,75,620ను కుటుంబానికి అందజేశారు. ఈ సహాయం తో పాటు ఇప్పటివరకు చిన్నారులకు మొత్తం రూ.4,24,500 ఆర్థిక సహాయం అందినట్లు వివరించారు. లింగాపురం గ్రామంలో పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు, మిత్రులు, బంధువులు ముందుకు వచ్చి సహకరించడం విశేషంగా నిలిచింది. ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ కుటుంబ సభ్యులు పేరు పేరుగా కృతజ్ఞతలు తెలిపారు.



## కన్నారావుపేటలో బోరింగు రిపేర్

అక్షర దర్బార్, నల్లబెల్లి : నల్లబెల్లి మండలం కన్నారావుపేట గ్రామంలో ప్రాథమిక పాఠశాల పరిసర ప్రాంతంలో గత కొన్నేళ్లుగా బోరింగు పాడైపోవడం, అందువల్ల నీటి కొరత ఏర్పడటం గమనించబడింది. గ్రామ సర్పంచ్ పల్నాటి మూర్తి వెంటనే స్పందించి బోరింగును మరమ్మతు చేయించారు. ఈ చర్యకు గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేసి, సర్పంచ్‌ను ప్రశంసించారు.

## సీపీఐ బహిరంగ సభను జయప్రదం చేయండి

అక్షర దర్బార్, కేసముద్రం : జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ మండల కన్వీనర్ చొప్పరి శేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కన్వీనర్ చొప్పరి శేఖర్ మాట్లాడుతూ..దేశంలో నాడు స్వాతంత్రోద్యమం నుండి నేటి వరకు ప్రజల కోసం ఉద్యమించిన ఏకైక పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు ఉత్సవాలు జరుపుకోవడం గర్వకారణమని ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు వేలాదిగా ఈ ప్రాంతం నుంచి కదలి రావాలని





పిలుపునిచ్చారు. దేశంలో ఫాసిస్టు బిజెపి పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. భారతదేశంలో విభజించి పాలించే బిజెపిని ఓడించాలన్నారు. కమ్యూనిస్టులు ఎక్కడున్నారు అనే వారికి ఖమ్మం లో జరిగే భారీ బహిరంగ సభ ద్వారా ఈ పాలకులు కు బుద్ధి చెబుతామన్నారు. 40 దేశాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నారని దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి సిపిఐ ప్రతినిధులు వేలాదిగా తరలివస్తున్న ఈ బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. ఎర్ర చొక్కాలు ఎర్ర చీరలు ధరించి ఖమ్మంలో కదం తొక్క పోతున్నామని హలో కామ్రేడ్ ఛలో ఖమ్మం పేరుతో వేలాదిగా కదలి వచ్చి బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మంద భాస్కర్, పూజారి రవి, ఎస్కే ఇమామ్, దాసరి సాయిలు, బిక్షపతి, దాసరి యాకయ్య, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



# మహా జాతరలో పాల్గొనండి

- సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ విష్ణుదేవ్ వర్మకు మంత్రుల ఆహ్వానం
- జాతర పోస్టర్ ఆవిష్కరించిన సీఎం



అక్షరదర్బార్, మేడారం : ఈనెల 28 నుంచి 31 వరకు ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో జరిగే అతిపెద్ద ఆదివాసి గిరిజన ఆధ్యాత్మిక వేడుక సమ్మక్క సారలమ్మ మహా జాతరలో పాల్గొనాల్సిందిగా రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మేడారం ఆలయ పూజారులతో సోమవారం అసెంబ్లీ ఛాంబర్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర పోస్టర్ ను ఆవిష్కరించారు. మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతరకు విచ్చేసి అమ్మవార్లను దర్శించుకోవాలని కోరుతూ రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మన్ కూడా రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ, గిరిజన పూజారులు సోమవారం లోక్ భవన్ లో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఆలయ ఈవో వీరస్వామి తదితరులు పాల్గొన్నారు. మంత్రి సీతక్క, వనదేవతల పూజారులు అసెంబ్లీ ప్రాంగణంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబును కలిసి మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకావాలని ఆహ్వానించారు. అమ్మవార్ల జాతర ఆహ్వాన పత్రిక, బంగారం ప్రసాదాన్ని అందజేశారు. మంత్రి సీతక్క వెంట వనదేవతల పూజారులు కాక వెంకటేశ్వర్లు, సిద్దబోయిన జగ్గారావు, కాక సమ్మయ్య ఉన్నారు.

**- ఈనెల 19న గద్దెల పునః ప్రారంభం**

ఈనెల 19న మేడారంలో సమ్మక్క సారలమ్మ పునః ప్రారంభం కార్యక్రమం జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమ్మక్క సారలమ్మ గద్దెలను, ఆలయ ప్రాంగణాన్ని ప్రారంభించనున్నారు. మేడారంలో ప్రభుత్వం ఈ ఏడాది గద్దెల ప్రాంగణంలో అభివృద్ధి పనులు చేపట్టిన విషయం తెలిసిందే.

## నర్సింగ్ విద్యార్థినుల నిరసన

అక్షర దర్బార్, మహబూబాబాద్ : నర్సింగ్ కళాశాలలో కనీస మౌలిక సదుపాయాలు లేని కారణంగా విద్యార్థినులు ఉద్రిక్తతకు గురయ్యారు. గత కొంతకాలంగా సమస్యలను యాజమాన్యం పట్టించుకోకపోవడంతో, విద్యార్థినులు ప్రధాన గేట్లకు తాళాలు పెట్టినప్పటికీ, ఆ తాళాలను బద్దలు కొట్టి కళాశాల ప్రాంగణం నుండి రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు. వీరు తమ సొంత బిల్డింగ్ అందించాలి, అద్దె భవనాల్లో సౌకర్యాలు లేక ఇబ్బందులు తీరాలి అని డిమాండ్ చేశారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడాన్ని యువత మండిపడ్డారు. ఈ నిరసనకు DSFI (Democratic Student Federation of India) పూర్తి మద్దతు ప్రకటించింది. నాయకులు విద్యార్థుల సమస్యలను మానుకోకుండా వెంటనే పరిష్కరించాలన్నారు, లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.





## 'కేసముద్రం' ఓటరు జాబితాల్లో తప్పుల తడక

అక్షర దర్బార్, కేసముద్రం : కేసముద్రం మున్సిపాలిటీలో తాజాగా విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలు తప్పుల తడకగా ఉన్నాయని ఓటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక వార్డుకు చెందిన ఓటర్లు మరో వార్డులో నమోదు కావడం, పలు వార్డుల్లో గతంతో పోలిస్తే ఓటర్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడం వంటి లోపాలు వెలుగులోకి వచ్చాయి. అంతేకాకుండా కొన్ని గ్రామ పంచాయతీలకు చెందిన ఓట్లు తప్పుగా మున్సిపల్ పరిధిలోకి చేరినట్లు తెలుస్తోంది. ఈ లోపాలు సాంకేతిక తప్పిదాల వల్లనా, సిబ్బంది నిర్లక్ష్యమా, లేక తగిన సమయం ఇవ్వకుండా హడావుడిగా ముసాయిదా జాబితాలను విడుదల చేయడమే కారణమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓటర్లు, రాజకీయ ఆశావాహులు ఓటర్ జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి మున్సిపల్ కార్యాలయంలో అభ్యంతరాలు నమోదు చేస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాబితాలను సరిదిద్దాలని వారు కోరుతున్నారు.

## బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

అక్షర దర్బార్, నల్లబెల్లి : నల్లబెల్లి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎర్ర సుమన్ తండ్రి ఎర్ర మోహన్ రెడ్డి రాత్రి అనారోగ్యంతో మృతి చెందడంతో, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, లెంకల సాయిలు, చల్ల రాజన్న, మెరుగు రాజు, చిన్నాల మల్లేష్, కదుదురి సురేందర్, కూస కళింగ రాజు, లింగయ్య, మీరాల చెంద్రమౌళి, జెల్ల రవి తదితరులు కుటుంబాన్ని



పరామర్శించి, భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

## బ్రహ్మోత్సవాలకు రావాలని
# ముఖ్యమంత్రికి ఆహ్వానం

అక్షరదర్బార్, హనుమకొండ: ఐనవోలు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సోమవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈనెల 11 నుంచి 18 వరకు హనుమకొండ జిల్లా ఐనవోలులో మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్యమంత్రిని కలిశారు. మంత్రి సురేఖ మొదట సీఎం రేవంత్ రెడ్డికి స్వామివారి శేష వస్త్రాన్ని అందజేయగా ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ముఖ్యమంత్రిని ఆశీర్వదించి స్వామివారి చిత్రపటంతో పాటు



తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగొని ప్రభాకర్ గౌడ్, ఈవో సుధాకర్, అర్చకులు నరేష్, శ్రీనివాస్ తో పాటు నందనం గ్రామ సర్పంచ్ జెట్టబోయిన రాజు, మహమ్మద్ చోటే తదితరులు పాల్గొన్నారు.



## 'వేం'ను కలిసిన మున్నూరుకాపు
# నేతల బృందం

అక్షరదర్బార్, హనుమకొండ: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ ఆది శ్రీనివాస్ ను కాంగ్రెస్ పార్టీ మున్నూరుకాపు నాయకుల బృందం సోమవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ బృందంలో టీపీసీసీ నాయకులు ఈవీ శ్రీనివాస్ రావు, చిట్ల సత్యనారాయణ, సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, రుద్ర సంతోష్, తూము వినయ్, బొమ్మ శ్రీరామ్, అల్లం భాస్కర్, ఆనంద్ రావు, రాంభూపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు సమాజ నిర్మాణ కార్యక్రమాలు, మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు, సమాజ అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపు అంశాలతో పాటు కోకాపేటలో మున్నూరుకాపు సమాజానికి కేటాయించిన 5 ఎకరాల భూమి ల్యాండ్ స్థితిగతులపై విస్తృతంగా చర్చలు జరిపారు. ఈ అంశాలపై వారు సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయాలను తీసుకెళ్లి సంబంధిత జీవో జారీ చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఆ.. 17 మంది లొంగిపోతే..

- మావోయిస్టు రహిత రాష్ట్రంగా తెలంగాణ
- డీజీపీ శివధర్ రెడ్డి

అక్షరదర్బార్, హైదరాబాద్ : ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన వారు కేవలం 17 మంది మాత్రమే మిగిలి ఉన్నారని, వారు లొంగిపోతే రాష్ట్రం మావోయిస్టు రహితంగా మారుతుందని డీజీపీ శివధర్‌రెడ్డి సోమవారం ప్రకటించారు. కేంద్ర కమిటీలో నలుగురు, రాష్ట్ర కమిటీలో ఐదుగురు, డివిజన్ కమిటీలో ఆరుగురు బాధ్యతలు నిర్వహిస్తుండగా, అండర్ గ్రౌండ్‌లో ఒకరు, ఇతర విభాగాల్లో మరొకరు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో ఐదుగురు మహిళలు కూడా ఉన్నారని డీజీపీ వెల్లడించారు. 17 మంది మావోయిస్టులపై ప్రభుత్వం మొత్తం రూ.2.25 కోట్ల భారీ రివార్డును ప్రకటించిందన్నారు. హింసా మార్గాన్ని వీడి వీరంతా జనజీవన స్రవంతిలో కలవాలని, ప్రభుత్వం కల్పించే పునరావాస సౌకర్యాలను వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 'ఆపరేషన్ కగార్' గడువు ముగిసేలోపే తెలంగాణను మావోయిస్టు రహిత రాష్ట్రంగా మార్చడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మిగిలిన కొద్దిమంది కూడా లొంగిపోవడమే ఉత్తమమని హితవు పలికారు.

# త్వరితగతిన పరిష్కరించాలి

- ప్రజావాణి అర్జీలు పెండింగ్ లో ఉండొద్దు
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

అక్షరదర్బార్, హనుమకొండ: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారుల నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులను సత్వర చర్యలు చేపట్టాలన్నారు. దరఖాస్తుల పరిష్కార స్వభావాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. రిమార్కులు లేకుండా దరఖాస్తులను క్లోజ్ చేయరాదన్నారు. అర్జీలు అధికశాతం పెండింగ్‌లో ఉన్న తహశీల్దార్లు, గ్రేటర్‌వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు శాఖలు పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలు తనిఖీ సందర్భంగా అధికారులు ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతిని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించాలన్నారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో అతి తక్కువ శాతంగా ఉందని మండల ప్రత్యేక



అధికారులు ప్రత్యేక దృష్టిసారించి బీఎల్ఓలు, ఆర్పీలు డోర్‌టు డోర్ వెళ్లి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంను వేగవంతంకు చర్యలు చేపట్టాలన్నారు. నలబై సంవత్సరముల పైబడిన, నలభై సంవత్సరములలోపు వయస్సు కలిగిన వారి కుటుంబ సభ్యుల వివరాలతో 2002 ఓటర్ల జాబితా 2025 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేయాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు 153 వినతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, పరకాల, హనుమకొండ ఆర్డీవోలు డాక్టర్ కన్నం నారాయణ, రాథోడ్ రమేష్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గుడిసెవాసులను ఆదుకోవాలి



అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండల కేంద్రంలో బహుజన సంక్షేమ సంఘం (BSS) విలేకరుల సమావేశంలో వ్యవస్థాపక అధ్యక్షుడు మారపెల్లి క్రాంతికుమార్, పెద్దకోడెపాక శివారులోని సర్వే నంబర్ 633లో ఇల్లు లేని నిరుపేదలకు రెండు సంవత్సరాలుగా వసతులు కల్పించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావు ఇక్కడ క్వారీలను మూసివేస్తానని, నిరుపేదలకు శాశ్వత గృహాలు కల్పిస్తానని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు ఏం జరిగలేదని నిరసన వ్యక్తం చేశారు. బహుజన సంక్షేమ సంఘం ప్రభుత్వాన్ని రెండో విడత ఇందిరమ్మ ఇల్లు ఎంపికలో భాగంగా నిరుపేదలను గుర్తించి, శాశ్వత పట్టాలు కల్పించి గృహాలను నిర్మించమని డిమాండ్ చేసింది. సమావేశంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మోగ్గం సుమన్, హనుమకొండ ఉపాధ్యక్షులు మారపెల్లి విజయ్ కుమార్, శాయంపేట మండల అధ్యక్షులు మారపెల్లి సుధాకర్, అల్లే కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు జనగామకు కేటీఆర్

- ఏర్పాట్లను పరిశీలించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి



అక్షరదర్బార్, జనగామ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మంగళవారం జనగామలో పర్యటించనున్నారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో జనగామ జిల్లాలో బీఆర్ఎస్ మద్దతుతో గెలుపొందిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని దిశా నిర్దేశం చేయనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్యతో పాటు బీఆర్ఎస్ నేతలు జనగామలో కేటీఆర్ పర్యటన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేటీఆర్ కొద్ది రోజుల క్రితం మహబూబాబాద్ జిల్లాలో పర్యటించి బీఆర్ఎస్ మద్దతుతో విజయం సాధించిన సర్పంచులు, ఉపసర్పంచ్ లు, వార్డు సభ్యులను సన్మానించారు. తాజాగా మంగళవారం కేటీఆర్ జనగామ రానుండటం గులాబీ శ్రేణులకు జోష్ ఇస్తుంది.

# సహకార బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

అక్షరదర్బార్, నల్లబెల్లి : నల్లబెల్లి మండలం జిల్లా కేంద్ర సహకార బ్యాంకును సోమవారం సందర్శించిన జిల్లా ఏజీఎం ఎస్. మధు, రైతులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన రికార్డులను తనిఖీ చేసి, వ్యవసాయ రుణాలు సకాలంలో చెల్లిస్తే కేంద్రం ద్వారా 3% రాయితీ పొందగలిగిందని, ఆలస్యం చేస్తే అదనపు వడ్డీ మరియు సిబిల్ స్కోర్ ప్రభావం ఉంటుందని farmers కు హెచ్చరించారు. కేంద్ర సహకార బ్యాంకు అవకాశాలను రైతులు, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మధు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్లు ఎండి యాకుబ్ పాషా, కే విజయ్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ టీ శోభన్ పాల్గొన్నారు.

# ఎరువుల షాపుల్లో డీఏవో తనిఖీ

అక్షర దర్బార్, భూపాలపల్లి : జిల్లా వ్యవసాయ అధికారి (DAO) రైతులకు ఎరువుల పంపిణీలో ఇబ్బందులు కలగకుండా కొయ్యూరు, HACA వల్లంకుంట, రాజరాజేశ్వర ఫెర్టిలైజర్స్ వంటి విక్రయ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. DAO అధికారులు యూరియా నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, PoS మిషన్లలోని వివరాలను స్వయంగా పరిశీలించారు. ఎరువులు అక్రమంగా నిల్వ ఉంచడం, ధరలతో మోసం చేయడం, రశీదులు ఇవ్వకపోవడం వంటి వ్యవహారాల్లో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తమ ఆధార్ కార్డు చూపి ఎరువులు న్యాయంగా పొందాలని, ఏ డీలర్ ఇబ్బంది పెడితే వెంటనే వ్యవసాయ శాఖ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

# ప్రతి గ్రామపంచాయతీలో ప్రధాని మోడీ ఫొటో పెట్టాలి

అక్షర దర్బార్, నల్లబెల్లి : నల్లబెల్లి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు తడుక వినయ్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఆబిద్ అలీకి వినతిపత్రం అందజేశారు. వినయ్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి ప్రధానంగా కేంద్రం అందించే 14వ, 15వ ఆర్థిక సంఘ నిధుల ద్వారా జరుగుతున్నందున, రాష్ట్ర ముఖ్యమంత్రి ఫోటోను ప్రతిగ్రామంలో ఎలా పెడుతున్నారు. అలాగే దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఫోటోను ప్రతి గ్రామపంచాయతీలో కూడా ఏర్పాటు చేయాలని కోరారు. అవసరమైతే, మండల పార్టీ ఆధ్వర్యంలో స్వయంగా ఫోటో ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నాగరాజు, జిల్లా నాయకులు బచ్చు వెంకటేశ్వర్ రావు, వల్లే పర్వతాలు, మండల నాయకులు మురికి మనోహర్, ఓదెల అశోక్, ఊటుకూరి చిరంజీవి, తిమ్మాపురం శివ, కొండ్లె రమేష్, గుండెబోయిన నవీన్, జన్ను మధు, ఈర్ల రవి తదితరులు పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

**డిజిటల్ విప్లవంలో భాగంకండి!**

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915